
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 15 । ఆగస్టు । 2024



సోమశిలలో 20.34 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 20.34 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 8427 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.72,990
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,590
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,788
నవర (8 గ్రాములు)	రూ.54,304

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.4 /28.1

గాలిలో తేమ 64 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో ఉష్ణోగ్రతల్లో గురువారం పెద్ద మార్పు ఉండబోదని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

నెల్లూరు(క్రైమ్): స్వాతంత్య్ర వేడుకలకు నగరంలోని పోలీస్ కవాతు మైదానం ముస్తాబైంది. పోలీస్ వందన స్వీకరణ, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సన్నాహక ఏర్పాట్లు, కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం పరిశీలించారు. భద్రతపరంగా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎమ్మెఫ్డీ ద్వారా ప్రతి ఒక్కర్నీ తనిఖీ చేయాలనీ, పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుంకరయ్య, ఆర్‌ఐలు అంకమరావు, హరిబాబు, రాజారావు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌ల అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలను కలెక్టర్ ఆనంద్ బుధవారం అందజేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.12.48 లక్షల చెక్కును విద్యార్థులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పేరుతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ నిర్వహిస్తోందని, దీని ద్వారా ఐదు నుంచి పదో తరగతి వరకు ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తోందని చెప్పారు. రీజినల్ మేనేజర్ నాగరాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జేసీ బాధ్యతల స్వీకరణ



స్వాగతం పలుకుతున్న డీఆర్వో

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జేసీగా కార్తీక్ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. విజయనగరం జేసీగా విధులు నిర్వర్తిస్తూ నెల్లూరుకు బదిలీపై వచ్చిన ఆయనకు డీఆర్వో లవన్న స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

బియ్యాన్ని మార్చిచ్చాం

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(దర్గామిట్ట): రేషన్ షాపుల్లో ముక్కిన బియ్యాన్ని మార్చి మంచి బియ్యాన్ని అందజేశామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నరసింహరావు పేర్కొన్నారు. పేదలకు ముక్కిన బియ్యమే అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. జిల్లాలో మిల్లర్ల కుమ్మక్కు, నాసిరకం బియ్యంపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు. ఏఎస్‌పేట మండలం పొనుగోడు డీలర్‌కు సరఫరా చేసిన ఐదు బస్తాల్లో నాసిరకం బియ్యం వచ్చిన అంశం వాస్తవమేనని సివిల్ సప్లయ్స్ డీటీ తెలిపారన్నారు. బియ్యాన్ని మార్చిచ్చామని పేర్కొన్నారు. కందుకూరులోని కేజీబీవీ స్కూల్‌కు సరఫరా చేసిన బియ్యం నాణ్యతగా ఉందని చెప్పారు.

డీసీపల్లిలో 868 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 868 బేళ్లను బుధవారం విక్రయించారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 981 బేళ్లు రాగా, వాటిలో 868ను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. వేలంలో 1,11,833.4 కిలోల పొగాకును విక్రయించగా, రూ.3,45,83,203 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర కిలో రూ.358.. కనిష్ట ధర రూ.204.. సగటు ధర రూ.309.24గా నమోదైందని పేర్కొన్నారు.

జిల్లాకు బెస్ట్ సర్కిల్ అవార్డు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీడీసీఎల్ ప్రకటించిన అవార్డుల్లో జిల్లాకు బెస్ట్ సర్కిల్ అవార్డు లభించింది. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ చేతుల మీదుగా అవార్డును ఎస్‌ఈ విజయన్ గురువారం అందుకోనున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఈకి పలువురు అభినందనలను తెలియజేశారు.

ఫైబర్‌నెట్ ఉద్యోగుల సమ్మె

నెల్లూరు (దర్గామిట్ట): మూడు నెలలుగా జీతాలివ్వకపోవడంతో ఏపీ ఫైబర్‌నెట్ సంస్థలోని టెక్నికల్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. ఈ క్రమంలో జిల్లాలోని 26 వేల మంది వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రోజుల తరబడి ప్రసారాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సర్వజన ఘోష

‘అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని’ అన్న చందంగా మారింది నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి పరిస్థితి. అధునాతన భవనాలు, ఆపరేషన్ థియేటర్లు, నైపుణ్యం గల వైద్యులున్నా, రోగులకు సకాలంలో వైద్యం అందడం మృగ్యమవుతోంది. కొందరు డాక్టర్లు సమయపాలనను పాటించడంలేదు. మరికొందరు వస్తున్నా హాజరు వేసుకొని ప్రైవేట్ ప్రాక్టీస్‌కే పరిమితమవుతున్నారు. ఈ పరిణామాలతో జూనియర్ డాక్టర్లపై భారం పడుతోంది. వెరసి వైద్యం కోసం రోగులు హాహాకారాలు చేయాల్సి వస్తోంది. పెద్దాస్పత్రిలో సాక్షి బృందం సోమవారం చేపట్టిన పరిశీలనలో పలు సిత్రాలు వెలుగుచూశాయి.

జీజీహెచ్‌కు నిర్లక్ష్య గ్రహణం

- సమయపాలన పాటించని వైద్యులు
- విధులకు కొందరు గైర్హాజరు
- సరిపడా లేని వీల్ చైర్లు, కుర్చీలు
- ప్రైవేట్ ల్యాబ్‌లోనే కొన్ని రకాల రక్త పరీక్షలు
- ఐసీయూలో కానరాని ఏసీ

అన్నీ అగచాట్లే..!



వీల్‌చైర్‌ను నెడుతున్న సహాయకులు

- ఆస్పత్రిలో వీల్ చైర్లను పట్టేందుకు అవసరమైన ఎఫ్ఎన్వోలు, ఎమ్మెన్వోల కొరత తీవ్రంగా ఉంది. వీరు 30 మందే ఉన్నారు. వాస్తవానికి మూడు షిఫ్టుల్లో పనిచేయాలంటే కనీసం వంద మందైనా ఉండాలి.
- ఎమ్మారై తీసినా రోగులకు రిపోర్టు ఇవ్వడం లేదు. రేడియాలజిస్ట్ కొరత కారణంగా ఈ పరిస్థితి తలెత్తుతోంది.
- ఆస్పత్రిలోని పలు విభాగాల వద్ద కుర్చీలు సరిపడా లేవు. దీంతో ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు కిందే కూర్చుంటున్నారు. పలు విభాగాల వద్దా ఇదే పరిస్థితి.
- కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి.
- చెదలు, పాములు, ఎలుకలు, బొద్దింకలేకుండా చూడాల్సిన పెస్ట్ కంట్రోల్ నెలకు రూ.13 లక్షలు తీసుకుంటూ, రూ.50 వేల పని కూడా చేయడం లేదు. గతంలో పాముకాటుకు ఇద్దరు గురవ్వగా, ఒకరు మృతి చెందారు.
- వైద్యసేవల్లో తలెత్తే సమస్యలను తెలియజేసేందుకు నిర్దేశించిన ఫిర్యాదుల పెట్టె అలంకారప్రాయంగా మారింది.



ప్రసూతి విభాగంలో రక్త పరీక్షలకు బారులుదీరిన మహిళలు

గత ప్రభుత్వంలో ఎంతో ఘనం

2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ.. ఆస్పత్రుల బాగోగులను పట్టించుకోలేదు. నాడు 750 నుంచి 800 వరకు ఓపీ ఉండేది. ఈ తరుణంలో అదే ఏడాది సీఎంగా బాధ్యతలు స్వీకరించిన జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యల ఫలితంగా ఓపీ సంఖ్య ప్రస్తుతం 1200కుపైగా చేరింది. అప్పట్లో ఇన్‌పేషంట్ల సంఖ్య 300 వరకు ఉండగా.. నేడు 500 నుంచి 550 వరకు పెరిగింది. ఆపరేషన్లు, డెలివరీలూ పెరిగాయి. నాటి మందుల కొరత సమస్యనూ వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అధిగమించారు. అయితే టీడీపీ మరోసారి అధికారంలోకి వచ్చాక ఆస్పత్రుల్లో మౌలిక వసతుల అంశాన్ని విస్మరించారు.

ఇదండీ పరిస్థితి..

- ఉదయం 8.10 నుంచే ఓపీ చీటీలు రాయించుకున్న వందలాది మంది రోగులు.. సాధారణ, చర్మ, ఈఎన్టీ, సర్జరీ, కేన్సర్, గైనకాలజీ, పల్మనాలజీ, చిన్నపిల్లల విభాగం వద్దకు వెళ్తున్నారు. వాస్తవానికి ఎనిమిది గంటలకే వైద్యులొచ్చి రౌండ్స్ అనంతరం రోగులకు సేవలందించేందుకు ఓపీ వద్దకు తొమ్మిదింటికి రావాలి. ఆర్థోపెడిక్ వార్డును 9.20కు పరిశీలించగా.. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు మరో ఇద్దరు వైద్యులకు గానూ ఒక సీనియర్ రెసిడెంట్ డాక్టరే ఓపీ చూస్తున్నారు. మిగిలిన వారు వచ్చేసరికి పది గంటలైంది.
- సర్జికల్ ఓపీలో 9.30కు ఇద్దరు డాక్టర్లే సేవలందిస్తున్నారు.మరో ఇద్దరు లేకపోవడం గమనార్హం.
- 9.36కు కేన్సర్ ఓపీకి వెళ్లగా ఖాళీగా ఉంది. ఇక్కడ ఇద్దరు వైద్యులుండాలి. ఇదే అంశమై నర్సును ప్రశ్నించగా, డాక్టర్ వార్డులో ఉన్నారని చెప్పారు. అయితే ఇది వాస్తవం కాదు.
- 9.40కు ఈఎన్టీ వార్డుకు వెళ్లగా, ఖాళీగా దర్శనమిచ్చింది. మరోవైపు రోగులు మాత్రం ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో ఎదురుగా ఉన్న చర్మ సంబంధిత ఓపీలో డాక్టర్ సేవలందిస్తున్నారు.
- 9.45కు సైకియాట్రీకి చెందిన మూడు గదుల్లో ఓపీలను పరిశీలించగా, రెండు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఒక ఓపీ గదిలో మాత్రం జూనియర్ డాక్టర్ రోగులను పరిశీలిస్తున్నారు. ఈ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ గది తాళాలేసి ఉంది.
- గైనకాలజీ విభాగంలో తొమ్మిది నుంచే ఓపీ సేవలందుతున్నాయి
- ఉదయం తొమ్మిదింటికే జనరల్ ఫిజీషియన్ ఓపీ సేవలను ప్రారంభించారు. అయితే అక్కడ ఉండాల్సిన మరో డాక్టర్ సెలవుపై వెళ్లడంతో రెండో ఓపీ గది ఖాళీగా ఉంది.
- ఫిజియోథెరపీ విభాగంలో టెక్నీషియన్లు 8.10కే వచ్చి.. 8.30 నుంచి రోగులకు సేవలందించడం ప్రారంభించారు.
- అల్ట్రా సౌండ్ స్కానింగ్ వద్దకు రేడియాలజిస్ట్ పదింటికి వచ్చారు. అప్పటి వరకు గర్భిణులు, రోగులు స్కానింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఒకరే రేడియాలజిస్ట్ ఉండటంతో, ఎమ్మారై వద్ద చూసుకొని ఇక్కడికి రావడంలో ఆలస్యమవుతోంది.
- రోజూ ఓపీ ప్రారంభమయ్యే సమయానికే జనరిక్ మందుల షాపును తెరవాల్సి ఉంటుంది. అయితే పదింటికి దీన్ని తెరిచారు.



ఆర్థోపెడిక్ ఓపీ వద్ద నిరీక్షిస్తున్న రోగులు

సాక్షి నెట్‌వర్క్, నెల్లూరు: జిల్లాకే తలమానికమైన నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. వైద్యుల నిర్లక్ష్యం.. సిబ్బంది అలసత్వం.. వెరసి రోగుల పాలిట శాపంగా పరిణమించింది. తగినంత సంఖ్యలో వీల్ చైర్లు లేకపోగా.. ఉన్న వాటిని పట్టేందుకు వైద్య సిబ్బంది లేరంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ తరుణంలో రోగి ఆరోగ్య పరిస్థితితో ఆందోళనగా ఉండే సహాయకులే ఈ పనులూ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

పరీక్షలు బయట చేయించుకురండి

పెద్దాస్పత్రిలో కొన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేవు. బ్లీడింగ్‌తో వచ్చే గర్భిణులకు కోయాగ్యులేషన్ ప్రొఫైల్ పరీక్షలు చేయాల్సి ఉంది. దీని ఖరీదు సుమారు రూ.1500. అయితే దీన్ని బయట చేయించుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు. లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష పరిస్థితీ ఇదే. ఇందులో ఓ భాగమైన కొలెస్ట్రాల్ పరీక్షను మాత్రమే చేస్తున్నారు. షుగర్‌కు సంబంధించిన మూడు నెలల యావరేజ్ హెచ్‌బీఏ 1సీ పరీక్షను చేయడం లేదు.



రోగిని ఆటోలో ఎక్కిస్తున్న కుటుంబసభ్యులు

మందులా.. సారీ

మందులు ఎక్కువ భాగం అందుబాటులో ఉన్నా, కొన్ని రకాలు ఒక్కో సందర్భంలో ఉండటం లేదు. చేతికి పెట్టే సూది.. మూత్రం వచ్చేందుకు సంబంధించిన కెథీటర్ లాంటి వాటిని రోగులతో గత నెల్లో కొనుగోలు చేయించారు. ప్రస్తుతం వీటిని అందుబాటులోకి తెచ్చారు. పాంటప్రజోల్ మాత్రల బదులు ర్యాంటిడిన్ ఇస్తున్నారు. నరాల నొప్పులకు గాబాపెంటిన్ రాసిస్తే దాని స్థానంలో ప్రెగాబాలిన్ మాత్రలిస్తున్నారు. ఇలా సబ్‌స్టిట్యూట్ మందులతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆపరేషాన్

ఆపరేషన్ థియేటర్ వద్ద రోగులు నరకం చూస్తున్నారు. ఉదయం నాలుగు నుంచే ఆహారం తీసుకోకుండా ఉండే రోగులను ఎనిమిది గంటలకల్లా ఆపరేషన్ థియేటర్ బయట కుర్చోబెడుతున్నారు. కొందరైతే మధ్యాహ్నం 12, ఒంటి గంట వరకు సైతం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లడంలేదు. అప్పటి వరకు రోగులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

ఐసీయూలో పనిచేయని ఏసీలు

మొదటి అంతస్తులోని ఐసీయూలో ఏసీ కొంత మేర పనిచేస్తోంది. రెండో అంతస్తులో సుమారు 24 పడకల వరకు ఉన్న ఐసీయూలో ఏసీ సదుపాయమే లేదంటే అశ్చర్యపోక తప్పదు. మూడో అంతస్తులో పది ఆపరేషన్ థియేటర్లుండగా, అందులో మూడింట్లో ఏసీలు పనిచేయక వైద్యులు, రోగులు అల్లాడుతున్నారు.

పోస్ట్‌మార్టానికి చేయి తడపాల్సిందే

పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను మార్చురీకి తీసుకొస్తారు. ఇక్కడ శవపరీక్ష చేసిన డాక్టర్లకు రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేల వరకు సమర్పించుకోవాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. నగరంలోని సర్వేపల్లి కాలువకట్టకు చెందిన ఓ ప్రైవేట్ ఫొటోగ్రాఫర్ ఇక్కడే ఉండి ఫొటోలు తీసి బలవంతంగా డబ్బులు దండుతున్నారని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు.

మందుబాబులకు అడ్డా

నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వద్ద ఆస్పత్రి వైపు బీరుసీసాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళ మందుబాబులు ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారనే అంశం స్పష్టమవుతోంది.

రోగులు భారీగా.. సేవలు నామమాత్రంగా



ఎక్స్‌రే విభాగం వద్ద కుర్చీల్లేక నేలపైనే రోగులు

ఓపీలకు 1203 మంది.. ఇన్‌పేషంట్లు సుమారు 500 మంది ఉన్నారు. మొత్తం 750 పడకలున్నాయి. ఆస్పత్రిలో జనరల్, న్యూరో, ఆర్థో, గైనిక్, చిన్నపిల్లల విభాగం, సర్జరీ, పల్మనాలజీ, ఈఎన్టీ, దంత, చర్మ, నేత్ర, మానసిక, హెచ్‌ఐవీ, ఎమర్జెన్సీ తదితర విభాగాల్లో వైద్యసేవలందిస్తున్నారు. 77 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కళాశాల, అనుబంధ టీచింగ్ ఆస్పత్రి ఉన్నాయి. అయితే కొందరు వైద్యుల తీరుతో రోగులకు సేవలు త్వరగా అందడంలేదు.

నొప్పులు తాళలేకపోతున్నా



మా సొంతూరు శ్రీకాకుళం. ఉపాధి నిమిత్తం నెల్లూరొచ్చి వెంకటేశ్వరపురంలో ఉంటున్నాం. వెన్నుపూసలో నొప్పి వచ్చింది. దీంతో భుజాలు, వీపును కదిలించలేకపోతున్నా. స్టెరాయిడ్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉండగా, లేదంటున్నారు. దీంతో బయట కొనుగోలు చేశా. మత్తిచ్చే ఇంజెక్షన్ వేసేందుకు ఉదయం ఎనిమిది నుంచి ఆపరేషన్ థియేటర్ బయట కూర్చోబెట్టారు. ఇప్పుడు 12 గంటలవుతోంది. ఇంకా పిలవలేదు. బెడ్‌పై ఉంచకుండా తీసుకొచ్చి ఉక్కపోతలో బయట కూర్చోబెట్టారు. నొప్పులు తాళలేకపోతున్నా. త్వరగా వైద్యం చేస్తే బాగుంటుంది.

– సింహాద్రి

బయట కొనుగోలు చేయాలంటున్నారు



కాలు మొత్తం నొప్పి వస్తోంది. వైద్యుడి వద్ద చూపించుకున్నా. కొన్ని మందులను ఇవ్వగా, మరి కొన్నింటిని బయట కొనుగోలు చేయాలని సూచించారు. బయట ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేయలేక ఇక్కడికి వస్తే, ఇలా వ్యవహరించడమేమిటి..?

– శ్రీనివాసులు, పాత బిట్రగుంట



విరిగిన కుర్చీలు

పచ్చ నేతల ధనదాహం



భారీగా ఏర్పడిన గోతులు



గ్రావెల్ తవ్వకాలు జరిపిన భూమి వద్ద స్థానికులతో బాధితురాలు మల్లిక సుభాషిణి

గిరిజనుల భూములపై కన్నేసి..

- దౌర్జన్యంగా గ్రావెల్ తవ్వకాలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అక్రమార్జన కోసం బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నదులను కొల్లగొట్టి మట్టి, గ్రావెల్, ఇసుకను తవ్వేస్తూ దోపిడీ సాగిస్తున్న వీరి కన్ను తాజాగా గిరిజనులు సాగు చేసుకునే భూములపై పడింది. కుటుంబపోషణ కోసం పంటలను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న వీరి భూములను లాగేసుకొని గ్రావెల్ దందా సాగిస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారు.

ఎమ్మెల్యే సహకరిస్తున్నారనే ఆరోపణలు

తమ్ముళ్ల అడ్డగోలు వ్యవహారాలను అడ్డుకోవాల్సిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వీరికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేపల్లిలో సహజ వనరుల దోపిడీ పర్వానికి అంతేలేకుండా పోతుండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలతో కొల్లగొడుతూ..

వెంకటాచలం మండలం అనికేపల్లి పంచాయతీ గొలగమూడిలో అమాయక గిరిజనుల భూములను వదలకుండా గ్రావెల్‌ను దౌర్జన్యంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు. గిరిజనురాలు మల్లిక సుభాషిణి సర్వేపల్లి రిజర్వాయర్ సమీపంలో ఏళ్లుగా ఎకరా భూమిని సాగు చేసుకుంటున్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమిలో గ్రావెల్ బాగుందని తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు అక్కడ యంత్రాలను పెట్టి తవ్వకాలను సాగించారు. గ్రావెల్‌ను రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

ప్రాధేయపడినా కనికరమేదీ..?

తాము సాగు చేసుకునే భూమిలో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారని తెలుసుకున్న మల్లిక సుభాషిణి కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా టీడీపీ నేతలు కనికరించలేదు. అధికారం ఉందనే ధీమాతో ఈ దందాకు తెరదీశారు. గ్రావెల్ అక్రమ తవ్వకాల కారణంగా భూమిలో పదడుగుల లోతులో గోతులు ఏర్పడ్డాయి.

న్యాయం చేయాలని ఆందోళన

స్థానిక గిరిజనులతో కలిసి మల్లిక సుభాషిణి తన భూమి వద్దకెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అమాయక పేదల భూముల్లో గ్రావెల్ తవ్వకాలు సాగించిన వారిపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తరలింపు

ఆత్మకూరు: ప్రకృతి వనరులను కొల్లగొట్టడంలో టీడీపీ నేతలు ఒకరిపై ఒకరు పోటీపడుతూ వర్గాలుగా విడిపోయారు. చేజర్ల మండలం గొల్లపల్లిలో చెరువు మట్టిని 50కుపైగా ట్రాక్టర్లతో ఇటుక బట్టీలకు రెండు రోజులుగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. పార్టీ స్థానిక నేతల ఆధ్వర్యంలో చెరువు మట్టిని తరలిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే కొమ్మి అండతో పార్టీ మండల నేత లక్ష్మీనరసారెడ్డి బుధవారం అడ్డుకున్నారు. ఈ మార్గంలో తన కారును అడ్డుపెట్టి ట్రాక్టర్లను నిలిపేశారు. తాళ్లూరి గిరినాయుడి వర్గీయులైన స్థానిక టీడీపీ నేతలు ఈ విషయాన్ని మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లగా, మీ పంచాయతీలో జరుగుతున్న మట్టి తవ్వకాలను అడ్డుకోవడానికి వారెవరని, మీరే తోలుకోవాలని చెప్పారని సమాచారం. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొన్ని ఇటుక బట్టీలకు మట్టి తోలరాదని, ఈ షరతుతో సాగించుకోవచ్చని మండల నేత పేర్కొనడంతో సమస్య సద్దుమణిగింది.

వైద్యుల నిరసన ప్రదర్శన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ పల్లంరెడ్డి యశోధర ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ రెప్స్, నారాయణ, ప్రభుత్వ వైద్య కళాశాలల విద్యార్థులు బుధవారం సాయంత్రం నెల్లూరులో నిరసన ప్రదర్శన చేపట్టారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్య కళాశాలలో పీజీ చేస్తున్న విద్యార్థినిపై లైంగికదాడి చేసి, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేశారు.

కార్గో ఆదాయం పెంచండి


అదనపు గదిని ప్రారంభించిన అధికారులు

నెల్లూరు సిటీ: ఏపీఎస్ఆర్టీసీ కార్గో ఆదాయం పెంచాలని ఉద్యోగులకు ఆర్టీసీ ఈడీ ఆదాం సాహెబ్ సూచించారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం కార్గో కార్యాలయంలో అదనపు గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పార్సిల్స్‌ను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం విజయరత్నం, డీఎం-1 మురళీకృష్ణ, డిప్యూటీ సీటీఎం ఇబ్రహీం పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి పదిలం

భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు ఎందరో మహానుభావులు పోరాటాలు, త్యాగాలు చేశారు. జిల్లాలోని ప్రతి ఊరు స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య పాత్ర పోషించింది. నాటి గుర్తులు ఈనాటికీ పదిలంగా ఉన్నాయి. అందులో ఒకటి ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ (గాంధీ) ఆశ్రమం. దీని వేదికగా ఎందరో ఉద్యమకారులు స్వేచ్ఛా సమరంలో పాల్గొన్నారు.

- మహాత్ముని చేతుల మీదుగా ప్రారంభమైన సత్యాగ్రహ ఆశ్రమం
- రెండో సబర్మతిగా పేరు
- నాటి స్వేచ్ఛా పోరాటంలో ఎంతో కీలకం


పల్లిపాడులోని ఆశ్రమం


బిట్రగుంట స్టేషన్ వద్ద రైల్లో మహాత్మా గాంధీ (ఫైల్)

ఇందుకూరుపేట: స్వాతంత్ర్య సంగ్రామ చిహ్నంగా పినాకినీ ఆశ్రమానికి ప్రత్యేక స్థానం ఉంది. దీనికి రెండో సబర్మతిగా పేరుంది. ఎన్నో ప్రధాన ఘట్టాలకు ఊపిరిపోసిన ఈ ఆశ్రమ ఏర్పాటు వెనుక ఎంతో చరిత్ర ఉంది. నాటి ఉద్యమంలో భాగంగా మహాత్మా గాంధీ జిల్లాలో ఐదుసార్లు పర్యటించారు. ఆయనకు పల్లిపాడుతో విడదీయరాని బంధం ఉంది. నాడు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో ఆశ్రమం నిర్మించాలని జాతిపిత భావించారు. అప్పుడు గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమంలో ఉన్న పల్లిపాడు వాసులు దిగుమర్తి హనుమంతరావు, కృష్ణమ్మ దంపతులు, నెల్లూరు నుంచి చతుర్వేదుల వెంకటకృష్ణయ్య ఉన్నారు. వీరంతా గాంధీ కోరిక మేరకు పల్లిపాడులో ఆశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ సమకూర్చిన భూమిలో ఆశ్రమం నెలకొల్పారు. దీనిని 1921 ఏప్రిల్ ఏడో తేదీన స్వయానా గాంధీ ప్రారంభించారు. దీని బాధ్యతలు చూసుకునేందుకు ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. దీని వేదికగా అనేక కార్యక్రమాలు జరిగాయి.

జాతిపిత రాకతో పులకించిన బిట్రగుంట

బిట్రగుంట: బిట్రగుంట.. రైల్వే పరంగానే కాదు.. జాతిపిత జ్ఞాపకాలతోనూ చరిత్ర పుటలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా గాంధీ దేశ పర్యటన చేపట్టారు. రైలు మార్గంలో ప్రయాణిస్తున్న ఆయన బిట్రగుంటలో కొద్దిసేపు ఆగి స్థానికుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. 1946 జనవరి 21వ తేదీన గాంధీ చెన్నైకి వెళ్తూ బిట్రగుంట వద్ద ఆగారు. ఆయన్ను చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన పౌరులు, ఉద్యమకారులు, రైల్వే కార్మికులతో ప్లాట్‌ఫారం, యార్డ్ జనంతో నిండిపోయాయి. మహాత్ముని ప్రసంగానికి ఉత్తేజితులైన భారత ప్రజలతోపాటు కొంతమంది బ్రిటిష్ మహిళలు కూడా ఉద్యమానికి సహాయంగా నగలు, నగదు కానుకగా అందజేశారు. అప్పటి ఎంఎస్ఎం రైల్వే ఎంప్లాయీస్ యూనియన్‌కి చెందిన ఆర్వీ సుబ్రహ్మణ్యం, ఏటీ తంగరాజు, అమృత లింగం తదితరులు మహాత్ముడిని ఘనంగా సన్మానించారు. స్థానికులకు గర్వకారణమైన ఈ విషయాలు 'పినాకినీ తీరంలో మహాత్మా గాంధీ' పుస్తకంలో ప్రచురితమయ్యాయి.

పోలీసులకు అవార్డులు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అవార్డులు వరించాయి. ఏఎస్పీలు డి.హిమవతి, ఏవీఆర్‌పీబీ ప్రసాద్, జి.శ్రీనివాసరావు, నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, మహిళా డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరమణ, ఎస్.కోటారెడ్డి, ఎ.శ్రీనివాస్, టి.సాయినాథ్, ఇన్‌స్పెక్టర్‌లు టీవీ సుబ్బారావు, ఎం.నాగేశ్వరమ్మ, ఎస్.రామారావు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ కోటేశ్వరరావు, ఎం.హైమారావు, ఆర్‌ఐలు కె.అంకమరావు, జి.హరిబాబు, జె.రామారావు, ఎస్సైలు ఎ.సైదులు, కె.ఇంద్రసేనారెడ్డి, కె.నరేష్, కె.గీతారమ్య, ఎస్.క్రాంతికుమార్, ఎ.సురేష్‌బాబు, జి.సుబ్బారావు, జి.వెంకటేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐ ఎం.హరికృష్ణతోపాటు 24 మంది సిబ్బంది, ఏపీ స్టార్స్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఏబీ కాంతరాజు, డిప్యూటీ జైలర్ జి.అరుణ కుమార్ ఇంకా సీఐడీలో నలుగురు, ఇంటెలిజెన్స్‌లో నలుగురు, కేంద్ర కారాగారంలో ముగ్గురు, అగ్నిమాపక శాఖలో ఐదుగురు, ఎక్సైజ్‌లో ముగ్గురు, ఐఎంఎల్ డిపోలో ముగ్గురు సిబ్బంది గురువారం పోలీసు కవాతు మైదానంలో అవార్డులు అందుకోనున్నారు.

మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా


శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందిస్తానని సంతపేట నూతన ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ నేరని యంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన ఎస్పీ జి.కృష్ణకాంత్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు 1996లో పోలీసు శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. గతంలో నెల్లూరు వన్‌టౌన్ (నేటి చిన్నబజారు) పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, వెంకటగిరి సీఐగా, ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సీఐడీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

టీచర్ల సర్దుబాటుపై డీఈఓకు వినతి

నెల్లూరు(టౌన్):బీటీఏ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి రామారావును నెల్లూరులోని డీఈఓ కార్యాలయంలో బుధవారం కలిశారు. కార్పొరేషన్ పరిధిలోని టీచర్లను ఒక యూనిట్‌గా తీసుకుని సర్దుబాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వినతి పత్రం సమర్పించారు. తొలుత బీటీఏ కార్యాలయంలో నెల్లూరు నగర శాఖ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కార్యదర్శులు భాస్కరయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు. వ్యతిరేక కార్యకలాపాలు చేయడంతో కోలా కిరణ్‌కుమార్‌ను సంఘం నుంచి తొలగించినట్లు చెప్పారు. బీటీఏ నగర అధ్యక్షుడిగా పెంచల ప్రసాద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 161

అవయవదానానికి అనుమతి


స్వాతితో నాగసింధు

కావలి: బిడ్డను కాపాడుకునేందుకు తల్లి అవయవదానానికి సిద్ధమైంది. దీనికి అనుమతి ఇచ్చినట్లు ఆర్డీఓ వీకే శీనానాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కావలి డివిజన్ పరిధిలోని విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల నాగసింధుకు స్వాతి అనే 13 ఏళ్ల కుమార్తె ఉంది. స్వాతి రెండు కిడ్నీలు పాడైపోయాయి. ఆమె బతకాలంటే ఒక కిడ్నీ అయినా అమర్చాలని డాక్టర్లు చెప్పారు. నాగసింధు ముందుకు రాగా వైద్యులు పరీక్షించి ఆమెది సరిపోతుందని నిర్ధారించారు. అవయవదానానికి ప్రభుత్వం అనుమతిస్తేనే చేస్తామని వైద్యులు చెప్పారు. దీంతో నాగసింధు కుమార్తెతో కలిసి ఆర్డీఓను కలిసి విన్నవించింది. ఆయన దీనికి అనుమతి ఇచ్చారు.

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై కొందరు హత్యాయత్నం చేసిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. హరనాథపురం సర్వేపల్లి కాలువకట్టకు చెందిన శ్రీనివాసులు పెయింట్ పనిచేస్తుంటాడు. అతడికి అదే ప్రాంతానికి చెందిన నితిన్, కిరణ్, తేజ స్నేహితులు. మూడునెలల క్రితం వారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అప్పటి నుంచి వారు శ్రీనివాసులుపై కక్ష తీర్చుకోవాలని సమయం కోసం వేచి చూడసాగారు. ఈనెల 13వ తేదీ అర్ధరాత్రి పనికి ఎందుకు వెళ్లడం లేదని శ్రీనివాసులును తల్లి మందలించడంతో మనస్తాపానికి లోనై బ్లేడ్‌తో కుడి చేతిపై కోసుకోవడంతో రక్తస్రావమైంది. దీంతో కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి బయలుదేరారు. దారిలో నితిన్, కిరణ్, తేజ, సాయి మోటార్‌బైక్‌లపై వచ్చి ఆటోను అడ్డగించారు. మాట్లాడాలంటూ శ్రీనివాసులును కిందకు దించి బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడి తమ్ముడు ముఖేష్‌బాబు, మరో వ్యక్తి అడ్డుకోవడంతో నిందితులు పరారయ్యారు. తీవ్రగాయాలతో శ్రీనివాసులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ముఖేష్‌బాబు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు బుధవారం ఉదయం హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

ఏర్పాట్ల పరిశీలన


సూచనలిస్తున్న జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని పోలీసు కవాతు మైదానంలో గురువారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జేసీ కార్తీక్ పరిశీలించారు. అధికారులకు సూచనలిచ్చారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జేసీ వెంట డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్డీఓ మలోల ఉన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ


ఘర్షణకు దిగిన యువకులు

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్టపై బుధవారం సాయంత్రం సినిమా సీన్‌ను తలపించేలా విద్యార్థులు ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుప్పించుకున్నారు. దీంతో అక్కడ వాకింగ్ చేస్తున్న జనం భయాందోళనకు గురయ్యారు. వివరాలు.. పలు కాలేజీ విద్యార్థులు ఆనకట్ట వద్దకు చేరుకుని మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఓ గ్రూపులోని యువకుడిని మరో గ్రూపునకు చెందిన వారు కామెంట్ చేయడంతో వివాదం చెలరేగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనకు పాల్పడిన యువకుల్లో పట్టణంలోని యాదవవీధికి చెందినవారు ఉన్నట్లు సమాచారం. అడ్డం తీస్తున్నా వినకుండా తన్నుకోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకోగా విద్యార్థులు పారిపోయారు. ఈ విషయమై ఎస్సై ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్నామని, ఆ తర్వాత వారిపై కేసు నమోదు చేయాలా? లేక కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేయాలా? అనే దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.